గ్రహణం వీడేనా!

ప్రజలకు ఆహ్లాదం పంచాల్సిన పార్కు కళతప్పింది. ఏపీఐఐసీ మెలికతో పార్కుకు గ్రహణం పట్టింది. ఫలితంగా ఆట పరికరాలు తుప్పుపట్టాయి. పచ్చదనం కనుమరుగు అయింది. ఫకీర్‌తక్యా వాసులు సేదతీరడానికి చోటు కరువైంది. ప్రైవేటు కార్యకలాపాలకు వేదికైంది. **తమ ప్రాంత ప్రజలకు వినోదం పంచేలా పార్కును అభివృద్ధి చేయాలని గ్రామ వాసులు అటు ప్రజాప్రతినిధులు.. ఇటు అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.**



ముళ్లపొదలతో దర్శనమిస్తున్న పార్కు

పార్కు స్థలంపై వివాదం

తుప్పుపట్టిన ఆట పరికరాలు

కళావిహీనంగా మైదానం

ఫకీర్‌తక్యా వాసులకు ఆహ్లాదం కరువు



శిథిలావస్థకు చేరుకున్న పార్కులోని పిల్లల ఆటవస్తువులు

కూర్మన్నపాలెం: ప్రజల **శ్రమ వృథా అయింది.** ఎన్నో ఆశలతో ఖాళీగా **ఉన్న ప్రభుత్వ స్థలంలో** ఏర్పాటు చేసుకున్న **పార్కు వివాదాల మధ్య మరుగున పడిపోయింది.** దీని **వల్ల ఆ ప్రాంతవాసులు** కాసేపు సేదతీరడానికి **కూడా వీల్లేని పరిస్థితి** నెలకొంది.

ఇదీ విషయం

జీవీఎంసీ 86వ వార్డు **పరిధి ఫకీర్‌తక్యాలో 90** శాతానికి పైగా ముస్లింలు **నివసిస్తున్నారు.** గ్రామంలో ఖాళీగా ఉన్న కొంత ప్రభుత్వ స్థలాన్ని అక్కడివారు15 ఏళ్ల కిందట పార్కుగా అభివృద్ధి చేశారు. కొంతమంది దాతలు, స్థానికుల సహకారంతో పార్కుకు అవసరమైన సామగ్రి అమర్చుకున్నారు. పెద్దలు సేదతీరడానికి బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు జారుడు బల్లలు, ఇతర పరికరాలు ఏర్పాటు చేశారు. వేలాది రూపాయల వ్యయంతో ఉయ్యాలలు, వినోదాన్ని అందించే ఇతర సామగ్రితో పాటు వ్యాయామానికి అవసరమైన పరికరాలతో పార్కును అందంగా అలంకరించారు. కొన్నాళ్లపాటు ఫకీర్‌తక్యాతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పార్కులో సేద తీరారు.పిల్లలు ఆనందంగా గడిపారు. అయితే వారి ఆనందం ఎంతోకాలం నిలువలేదు.

స్థలం తమదని ఏపీఐఐసీ అనడంతో...

అయితే ఆ స్థలం తమది అంటూ ఏపీఐఐసీ అధికారులు ముందుకు వచ్చారు. పార్కును అభివృద్ధి చేయవద్దని హుకుం జారీ చేశారు. అప్పటి నుంచి ఆ పార్కుకు గ్రహణం పట్టేసింది. నాటి నుంచి ముస్లింలు నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లు అరిగిపోయేలా తిరిగినా ఫలితం దక్కడం లేదు. తమకు ఆహ్లాదం పంచే పార్కును అభివృద్ధి చేయాలని వారు వినతి పత్రాలు ఇచ్చి తిరుగుతుంటే.. మరో వైపు అక్కడ సామగ్రి తుప్పుపట్టి పాడైపోతుంది.కుర్చీలు కూడా విరిగిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి.

సొంత వ్యాపారాలకు అడ్డాగా..

పార్కు కళావిహీనంగా మారడంతో ప్రజలు **అటువైపు వెళ్లడం లేదు. ఇదే అదునుగా తీసుకొని కొంత మం**ది తమ వ్యాపారాలకు ఆ స్థలాన్ని వాడుకొని దర్జాగా అనుభవిస్తున్నారు. దీంతో ఆ స్థలాన్ని గ్రీన్ బెల్ట్‌కు కేటాయించాలని కొందరు కోరగా.. మరికొందరు పార్కుగా అభివృద్ధి చేయాలని విన్నవిస్తున్నారు. ఏపీఐఐసీ మాత్రం ఆ స్థలం తమదని చెబుతోంది.

ఆక్రమణకు స్కెచ్

పార్కు స్థలంపై వివాదం నెలకొనడంతో **కొందరు ఆసరాగా తీసుకొని ఆక్రమించే** ప్రయత్నాలు **చేస్తున్నట్లుగా విమర్శలు వినిపిస్తు**న్నాయి. అందుకే **వ్యాపార కార్యకలాపాలతో స్కెచ్** వేస్తున్నారు. పాల**కులు, అధికారులు స్పందించి ఏదో** ఒక నిర్ణయం తీసు**కోక పోతే ఆ ప్రాంత వాసుల ఆ**శలు అడియాశలు **అయ్యే అవకాశాలు అధికంగా** కనిపిస్తున్నాయి.



పార్కులో ఇతరుల సామగ్రి



పార్కులో ఇసుక నిల్వలు

పార్కును అభివృద్ధి చేయాలి



మా ప్రాంతంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కుకు అభివృద్ధి చేశాం. ఇది చిన్నా పెద్దలకు ఎంతో ఆహ్లాదం పంచేది. ఇంతలో ఆ స్థలం తమదని ఏపీఐఐసీ అధికారులు మెలిక పెట్టారు. అప్పటి నుంచి నిర్వహణ లేక పార్కు కళ తప్పింది. మాకు సేద తీరడానికి చోటు కరువైంది. ఆ స్థలాన్ని జీవీఎంసీ స్వాధీనం చేసుకుని పార్కును అభివృద్ధి చేయాలని అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యేకి వినతి పత్రాలు అందజేశాం. సానుకూలంగా స్పందించారు.

– ఇమామ్ హుస్సేన్, అధ్యక్షుడు, అంజుమన్ నూర్ అహ్మదీ

ప్రజల కోసం ఆలోచించాలి



మా ప్రాంతంలో ఒక్క పార్కే ఉంది. అదికూడా ఇప్పుడు దూరమైంది. అలసిపోయిన ప్రజలు కాసేపు కూర్చొని సేద తీరేందుకు చోటు లేదు. అందు వల్ల పాలకులు ప్రజల కోసం ఆలోచించి పార్కును అభివృద్ధి చేయాలి.

– మహ్మద్ రషీద్, ఫకీర్‌తక్యా పెద్ద

పెద్దలకు విన్న వించాం



ఇప్పటికే అనేకమంది పెద్దలను కలిసి పార్కును అభివృద్ధి చేయాలని కోరాం. అది గ్రీన్ బెల్ట్ స్థలం అన్నారు. మొక్కలు పెంచడంతోపాటు పార్కుగా అభివృద్ధి చేస్తే ఇంకా బాగుంటుంది. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలి. లేకపోతే ఆ స్థలం ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఉంది.

– అయూబ్, స్థానికుడు

అధినేతతో ఆత్మీయ సమావేశం



వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కోమటి శ్రీనివాసరావు దంపతులు

కూర్మన్నపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో 87వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు కలిశారు. పార్టీ పటిష్టానికి క్షేత్రస్థాయిలో పని చేయాలని తమ అధినేత సూచించారని శ్రీనివాసరావు తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండడంతో పాటు ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని నిర్దేశించారని చెప్పారు.

దేవన్‌రెడ్డికి అభినందన



దేవన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డగోవింద్

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డిని మంగళవారం ఆ పార్టీ 87వ వార్డునాయకులు కలిసి అభిందించారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి దేవన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని.. హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ఆయన్ను సత్కరించిన వారిలో బొడ్డగోవింద్, అశోక్ రాజు,శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జీఎం మృతి



రామశేషు(ఫైల్)

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ ఎ.వి.ఎ. రామశేషు మృతి చెందారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. కోక్ ఓవెన్స్ విభాగంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన వ్యక్తిగా రామశేషు పేరు గాంచారు. రామశేషు మృతిపై ఉక్కు ఉద్యోగులు సంతాపం తెలిపారు.

క్లుప్తంగా

పరమ శివా.. పాహిమాం



అభిషేకాలు జరిపిస్తున్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి గ్లవానిపాలెం పరిధి జూబిలీహిల్స్ కాలనీలో కొలువై ఉన్న ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు మహా శివునికి రుద్రాభిషేకం, విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆంజనేయస్వామి పంతులు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భక్తులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులతో బీహెచ్‌పీవీ గ్రౌండ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ గ్రౌండ్ వాకర్స్ ఫ్రెండ్స్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడిగా చిన వెంకటరెడ్డి, అధ్యక్షుడిగా ఈడుపుగంటి అనార్ బాబు, ప్రధానకార్యదర్శిగా కొత్తూరు తేజ భాస్కరరావు, కోశాధికారిగా నమ్మి అజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా వి.బాబూరావు, కె.రామజోగినాయుడు, సంద్రాన నూకరాజు, గొలగాని రాంబాబు, ముగ్గురు సంయుక్త కార్యదర్శులు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, గౌరవ సలహాదారులుగా పలువురిని ఎన్నుకున్నారు.

స్టార్ కిడ్స్ విజేతగా భవిష్య



టైటిల్ విజేత భవిష్యకు స్టార్ కిడ్స్ కిరీటవ బహూకరిస్తున్న అతిథులు

అక్కిరెడ్డిపాలెం: స్టార్ కిడ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాషన్ షోలో గాజువాక ఆటోనగర్‌లోని ఎస్ఎస్ పాఠశాలకు చెందిన ఒకటో తరగతి విద్యార్థి భవిష్య రేగులవలస టైటిల్‌ను గెలుచుకుంది. నగరంలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో మూడు రోజుల పాటు జరిగిన ఈవెంట్‌లలో భవిష్య విజేతగా నిలిచింది. ఈ మేరకు మంగళవారం నిర్వాహకులు కిరీటాన్ని బహూకరించారు. భవిష్య విజయంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.


పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి



దీన్ దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గాజువాక: జన సంఘ్ పార్టీ పూర్వ అధ్యక్షుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయకు బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గాజువాకలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో దీన్ దయాళ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఏకాత్మతా సిద్ధాంత రూపకల్పనలో ఆయన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, నాగేశ్వరరావు, బొండా ఎల్లాజీరావు, రోహిణి, కట్టా పద్మ, శ్రీదేవి, రంగనాయకులు పాల్గొన్నారు.

పచ్చదనం హరించుకుపోతున్నా పట్టదా..



దువ్వాడ రైల్వేస్టేషన్‌లో నాలుగో ప్లాట్‌ఫారంపై మోడువారిన చెట్లు

అగనంపూడి: స్వచ్ఛ భారత్, పచ్చదనం, హరిత భారతదేశం నినాదాలకే పరిమితమవుతున్నా యి. దువ్వాడ రైల్వేస్టేషన్ ఆవరణలోని మొక్కలు, చెట్లు కనుమరుగవుతున్నాయి. అయినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ప్లాట్‌ఫారాలపై షెడ్లు, ఫ్యాన్లు ఉండవు. కనీసం చెట్లు ఉన్నా ప్రయాణికులు సేదతీరడానికి వీలుందేదని ప్రయాణికులు వాపోతున్నారు.

స్వర్ణ నూకాంబిక పండగ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: ఎంతో మహిమగల తల్లి స్వర్ణ నూకాంబిక అని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో వేంచేసియున్న స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలను బుధవారం నుంచి నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అమ్మవారి పండగ మహోత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అండిబోయిన తాతారావు, ఆడారి రమణ, వై. నాయుడు, బి. అప్పలరాజు, ఉరుకూటి అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

19 మంది విద్యార్థులకు కొలువులు



మేనేజర్లుగా ఎంపికైన విద్యార్థులతో యాజమాన్య ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 19 విద్యార్థులు డీమార్ట్‌లో మేనేజర్లుగా ఉద్యోగావకాశాలు దక్కించుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదన రావు పేర్కొన్నారు. ఈమేరకు కళాశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. నెలకు రూ.30వేల వేతనంతో ఉద్యోగాలు పొందడంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డీన్ బోడే ప్రసాద్ కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ హరీష్, ఎంబీఏ కోఆర్డినేటర్ మనోజ్ఞ, ఎంబీఏ విభాగాధిపతి బి.చంద్ర పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమికి గంగవరం ముస్తాబు



మాఘ పౌర్ణమి సందర్భంగా గంగవరంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఎగ్జిబిషన్



పాటలు పాడుతున్న కళాకారులు

పెదగంట్యాడ: మండలంలోని గంగవరం గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామం మొత్తం ముస్తాబైంది. పాత గంగవరంలో వేంచేసియున్న మాధవస్వామి మహాలక్ష్మి తీర్థాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాత్రి గంగవరం గ్రామస్తులు జాగరణ చేశారు. మహాలక్ష్మీ మాధవస్వామి తీర్థాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జాగరణ అనంతరం భక్తులంతా బుధవారం వేకువ జామున పాత గంగవరం తీరంలో పుణ్య స్నానాలు ఆచరించి ఆపై మహాలక్ష్మి మాధవస్వామిని దర్శించుకోనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఎల్‌డీసీ నూతన విభాగాధిపతికి అభినందన



ఎల్‌డీసీ నూతన విభాగాధిపతి ఠాగూర్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎల్‌డీసీ) విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన జనరల్ మేనేజర్ టి.కె.ఎస్.ఆర్. ఠాగూర్‌ను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు అభినందించారు. హెచ్‌ఆర్‌డీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఠాగూర్‌ను హెచ్‌ఆర్‌డీతో పాటు ఎల్‌డీసీకి కూడా విభాగాధిపతిగా నియమించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయన్ను సత్కరించారు. కొమ్ము ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సువర్ణరాజు, సురేష్‌బాబు, తాండ్ర కనకరాజు, సోమునాయుడు, సుబ్బారావు, అరుణ్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ సమస్య పరిష్కరించాలి



ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న భెల్ విశ్రాంత, గుర్తింపు యూనియన్ ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, హయ్యర్ పెన్షన్ సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును భెల్ (హెచ్‌పీవీపీ) గుర్తింపు యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు కలిశారు. కొంత మంది కార్మికులకు 1992 నుంచి సర్వీసు ఉందని, కానీ 1997 నుంచి సర్వీసు నమోదైందని దీన్ని సరిచేయడానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్, సుభాకర్ సాహూ, బి.బాబూరావు పాల్గొన్నారు.

ఛాతినొప్పి వస్తే నిర్లక్ష్యం చేయవద్దు



స్టెమీ కార్యక్రమంపై రోగులు, వారి బంధువులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఉష, డాక్టర్ ప్రత్యూష

- అత్యవసరమైతే రూ.45వేల ఇంజక్షన్‌తో ప్రాణం నిలబెడతాం
- అగనంపూడి ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష

అగనంపూడి: ఛాతినొప్పి వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని జీవితాన్ని కాపాడుకోవాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష, నోడల్ అధికారి డాక్టర్ ప్రత్యూష అన్నారు. స్టెమీ కార్యక్రమంపై ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛాతిలో ఎక్కడైనా నొప్పి అపిపించినా, భుజం లాగడం, దవడ కింద నొప్పిలా రావడం, ఆకస్మికంగా ఒళ్లంతా చెమటలు పట్టడం, ఆయాసం, స్పృహతప్పి పడిపోవడం, గుండెలో దడ పుట్టేలా ఏ లక్షణాలు కనిపించినా గ్యాస్ట్రిక్ నొప్పిగా భావించి నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. ఈసీజీతో పాటు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి గుండెనొప్పిగా నిర్ధారణ అయితే గుండెపోటు నుంచి గట్టెక్కించడానికి రూ.45వేల విలువైన ఇంజక్షన్ ఆస్పత్రిలో ఇవ్వడంతో పాటు మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఆస్పత్రికి తరలిస్తామన్నారు. వీటిని సద్వినియోగపర్చుకోవాలని వారు కోరారు.ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపీకృష్ణ, లలిత, రేష్మా, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై కేంద్ర ఉక్కు మంత్రికి వినతి



కేంద్ర మంత్రులు కుమారస్వామి, వర్మలకు వినతి పత్రం అందజేస్తున్న పురందేశ్వరి, నాయకులు

ఉక్కునగరం: స్టీల్ బీఎంఎస్ నాయకులు మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్ సమస్యలను కేంద్ర ఉక్కు మంత్రి హెచ్.డి. కుమారస్వామి, సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు వివరించారు. రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి నేతృత్వంలో కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల ఇబ్బందులు, జీలాల బకాయిలు, పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికల్ బెనిఫిట్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది కుదింపు, దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను వివరించారు. త్వరలో స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి మీటింగ్ ఉందని, అందులో అన్ని విషయాలు చర్చించి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసిన వారిలో స్టీల్ ప్లాంట్ నాయకులు హనుమంతరావు, స్టీల్ బీఎంఎస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఉక్కు ఆస్పత్రి వైద్యులకు పతకాలు



ఉక్కు ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సుజాతకు పతకం అందజేస్తున్న అతిథులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎం. సుజాత, డాక్టర్ ఎ. మాధవిలకు పతకాలు లభించాయి. ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు రూర్కెలాలో ఆల్ ఇండియా స్టీల్ మెడికల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ (ఎస్మాక్) జరిగింది. ఈ కాన్ఫరెన్స్‌లో ఉక్కు వైద్యులు డాక్టర్ ఎం. సుజాత అందజేసిన పత్రానికి కాంస్య పతకం, డాక్టర్ ఎ.మాధవి సమర్పించిన పత్రానికి రజత పతకం లభించింది. జాతీయ కాన్ఫరెన్స్‌లో ఉక్కు ఆస్పత్రి వైద్యులకు పతకాలు లభించడంపై ఉక్కు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి జనరల్ మేనేజర్ డాక్టర్ జె.ఎన్. సారంగితో పాటు సెయిల్ స్టీల్‌ప్లాంట్లకు చెందిన ఆస్పత్రుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.